సాక్షి సిద్దిపేట

బుధవారం । 12 । మార్చి । 2025



బొట్టుబొట్టు ఒడిసి పట్టి..

రైతులు చాలా మంది డ్రిప్ పద్ధతిలో వరి సాగుచేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు.

వివరాలు 10లో ▸



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి..

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని పార్టీ నేతలు అన్నారు.

వివరాలు 11లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం సా. 6.31 గం.	గురువారం ఉ. 5.04 గం.

న్యూస్‌రీల్

మల్లన్న ఎనిమిదో వారం ఆదాయం రూ.58.39 లక్షలు



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో ఆదివారం రూ.58,39,513 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. మొత్తం మూడు రోజులలో ఈ ఆదాయం సమకూరిందన్నారు. భక్తుల వివిధ రకాల మొక్కులు, దర్శనాలు, లడ్డూ ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని తెలిపారు. గత ఏడా ది కంటే ఈసారి రూ.11,52,263 అధికంగా వచ్చిందని ఈఓ రామాంజనేయులు తెలిపారు.

దుబ్బాక మున్సిపల్ బడ్జెట్ రూ.22.22 కోట్లు

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సమక్షంలో ఆమోదం



శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్

దుబ్బాక: మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.22.22 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి ఆమోదించినట్లు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి గరిమా అగర్వాల్ సమక్షంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సాధారణ నిధులు, వివిధ గ్రాంట్లు కలుపుకొని ఆదాయం రూ.22.22 కోట్లుగా అంచనా కాగా, వ్యయం రూ.22.19 కోట్లుగా కేటాయించామన్నారు. ఆదాయం, వ్యయానికి సంబంధించి మొత్తంగా మిగులు బడ్జెట్ రూ.2.82 లక్షలు ఉందన్నారు. మున్సిపల్ సాధారణ ఆదాయం రూ.5.85 కోట్లు, వ్యయం రూ.5.82 కోట్లు ఉందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు రూ.80 లక్షలు, సిబ్బంది వేతనాలకు రూ.1.6 కోట్లు, విద్యుత్ చార్జీలకు రూ.62.5 లక్షలు అలాగే రుణాల చెల్లింపులకు రూ.40 లక్షలు కేటాయించామన్నారు.

వర్గల్ ఎంపీడీఓ బదిలీ

వర్గల్(గజ్వేల్): మండల పరిషత్ అధికారి విజయలక్ష్మి బదిలీ అయ్యారు. మంగళవారం ఎంపీఓ ఖలీమ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. యేడాదిపాటు సేవలందించి అందరి మన్ననలు పొందిన విజయలక్ష్మి, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ ద్వారా సొంత జిల్లా మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఆదర్శలో ప్రవేశానికి గడువు పెంపు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆదర్శ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈ నెల 20వరకు పొడిగించినట్లు ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులతో పాటు 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

గ్రూప్ 2లో 103వ ర్యాంక్

హుస్నాబాద్: పట్టణానికి చెందిన అయిలేని మణికంఠేశ్వర్‌రెడ్డి గ్రూప్ –2లో 103 ర్యాంక్ సాధించారు. గ్రూప్ 2 పరీక్షలో 392.5 మార్కులు వచ్చాయి. గతంలో గ్రూప్ –4లో 600 ర్యాంక్ సాధించిన మణికంఠేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఎండోమెంట్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఆయారే.. హోలీ
సహజ రంగుల కేళీ

హోలీ.. హోలీల రంగ హోలీ.. చెమ్మకేళీల హోలీ.. అంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా వేడుకలు ఘనంగా జరిపేందుకు అందరూ సిద్ధమవుతున్నారు. శుక్రవారం జరిగే పండుగకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాతకాలంలో హోలీ పండుగ అనగానే గోగిపూలు తదితర వాటి సహజరంగులో జరుపుకొనేవారు. కొంత కాలంగా చాలా మంది రసాయన రంగులనే వాడుతున్నారు. ఇందుకు భిన్నంగా సిద్దిపేట పట్టణంలోని స్వచ్ఛబడిలో కౌన్సిలర్ దీప్తీ ఆధ్వర్యంలో గోగిపూలు, క్యారెట్లు, మందారం, తోటకూరలను ఉడికించి రంగులను తయారు చేస్తున్నారు. దాదాపు 20 కేజీల వరకు రంగులను తయారు చేశారు. ఈ సహజసిద్ధమైన రంగులతో హోలీ వేడుకలకు సిద్ధమవుతున్నారు.

– సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



సహజంగా తయారు చేసిన రంగులను ఆరబెడుతున్న స్థానికులు





హోలీకి సిద్ధమైన రంగులు

మహిళలు అన్నింటా ముందుండాలి


అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో డీడబ్ల్యూఓ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటిబచావో బేటిపడావో దశాబ్ది ఉత్సవాలకు అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. రోజురోజుకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. లింగ భేదాలు లేకుండా అందరూ సమానం అనే భావనతో ముందుకు వెళ్లాలని, సమానత్వం, సాధికారత వైపు అడుగులు వేయాలన్నారు. మహిళల కోసం ఉన్న హక్కులను, చట్టాలను గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ, డీఏఓ, ఉద్యాన, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, షీటీం, భరోసా ఇన్‌చార్జి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి, సెట్విన్ అధికారి, ప్రకృతి ఎన్‌జీఓ, స్వార్డ్ ఎన్‌జీఓ సీఈఓ, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ గోల్‌మాల్

ఎస్సీ కార్పొరేషన్‌లో అక్రమాలు ● నేరుగా థర్డ్ పార్టీ పేరుతో చెల్లింపులు

ఎస్సీ కార్పొరేషన్‌లో అక్రమాలు వెలుగుచూశాయి. సబ్సిడీ పేరుతో రూ.కోట్లు స్వాహా చేశారు. అధికారి, కింగ్ బుక్‌స్టాల్ యజమాని, లబ్ధిదారుడు కుమ్మక్కై బ్యాంకర్‌కు సంబంధం లేకుండానే సబ్సిడీ గోల్‌మాల్ చేశారు. థర్డ్ పార్టీ పేరుతో 34 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.1.20కోట్ల సబ్సిడీని విడుదల చేశారు. యూనిట్లను ఏర్పాటు చేయకుండానే సబ్సిడీ డబ్బులను ఆ ముగ్గురు పంచుకున్నారు. కాసులకు ఆశపడి సదరు ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి మే, 2023 నుంచి సెప్టెంబర్ 2024 వరకు పనిచేసిన సమయంలో ఇష్టారాజ్యంగా సబ్సిడీలను విడుదల చేయడం గమనార్హం. థర్డ్ పార్టీ పేరుతో విడుదల చేసిన సబ్సిడీలపై 'సాక్షి' క్షేత్రస్థాయిలో పరిశోధన చేసింది. అనేక విషయాలు వెలుగు చూశాయి.



- 34 మందికి రూ.1.2కోట్లు విడుదల
- గతంలో పనిచేసిన అధికారి చేతివాటం
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటున్న దళిత సంఘాలు
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశోధనలో వెలుగు చూసిన నిజాలు

సాక్షి పరిశీలన

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో 2020–21లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో 60శాతం సబ్సిడీతో ఎకానామిక్ సపోర్ట్ స్కీం కింద దరఖాస్తులను ఆహ్వానించారు. దీంతో 1,576 మంది దరఖాస్తు చేశారు. ఏప్రిల్ 2023లో 1,408 మందికి రూ 33.29కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో రూ.21.18కోట్లతో 781 గ్రౌండింగ్ అయ్యాయని, మరో 627 మంది లబ్ధిదారులకు సంబంధించి సబ్సిడీ రూ.12.11కోట్లు బ్యాంక్‌లో ఉన్నాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

నేరుగా సబ్సిడీ విడుదల

గతంలో పని చేసిన ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి.. కింగ్ బుక్‌స్టాల్ యజమాని, లబ్ధిదారులు కలిసి సబ్సిడీ డబ్బులు పంచుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లో రుణం కోసం దరఖాస్తు దారుడు ఏర్పాటు చేసే యూనిట్‌కు సంబంధించి వివరాలతో బ్యాంక్‌ను సంప్రదించాలి. అప్పుడు బ్యాంక్ అధికారులు దరఖాస్తు దారుని వివరాలు పరిశీలించి రుణం మంజూరు చేయాలనుకుంటే బ్యాంక్ కాన్సెంట్ ఇస్తారు. ఆ పత్రాన్ని ఎస్సీ కార్పొరేషన్‌లో అందజేయాలి. అప్పుడు యూనిట్‌కు సంబంధించి సబ్సిడీని బ్యాంక్‌కు విడుదల చేస్తారు. అలా నిబంధనలు ఏమీ పాటించకుండానే ఇష్టారాజ్యంగా సబ్సిడీని నేరుగా అందించారు.

ఉన్నతాధికారులకు నివేదిక



యూనిట్ ఏర్పాటు చేస్తున్న వారికే సబ్సిడీని విడుదల చేయాలి. కానీ థర్డ్ పార్టీ పేరుతో సబ్సిడీని విడుదల చేయవద్దు. వివిధ యూనిట్‌లకు సంబంధించి నేరుగా గతంలో పని చేసిన అధికారి సబ్సిడీ విడుదల చేశారని తెలియడంతో ఉన్నత అధికారులు రిపోర్ట్ తెప్పించుకున్నారు.

– రామాచార్య, ఇన్‌చార్జ్ ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

కింగ్ బుక్‌స్టాల్‌కు చెందిన యజమానిని ఏజెంట్‌గా సదరు మాజీ అధికారి నియమించుకున్నారు. ఆ బుక్ స్టాల్‌కు చెందిన కుటుంబ సభ్యుల ద్వారా వివిధ ఎంటర్‌ప్రైజెస్‌ల పేర్ల మీద బ్యాంక్ అకౌంట్లను ఓపెన్ చేశారు. మే, 2023 నుంచి సెప్టెంబర్ 2024 వరకు థర్డ్ పార్టీ పేరుతో రూ.1.2కోట్లను సబ్సిడీని విడుదల చేశారు. ఎంటర్‌ప్రైజెస్ పేరు మీద ఆరుగురి సబ్సిడీలను రూ.26.80లక్షలు, కింగ్ బుక్ స్టాల్ పేరు మీద ముగ్గురికి రూ.14.40లక్షలు, కింగ్ భవాని ఎంటర్‌ప్రైజెస్ పేరు మీద మరో ముగ్గురికి రూ.10.80లక్షలు, అలాగే కింగ్‌కు సంబంధించిన కుటుంబ సభ్యుల పేర్ల మీద, వాహనాలు కొనుగోలు చేసేందుకు నేరుగా లబ్ధిదారులకే చెక్‌లను విడుదల చేశారు. ఇలా మొత్తంగా

చక్రం తిప్పిన కింగ్

థర్డ్ పార్టీ పేరుతో 34 మందికి సంబంధించి సబ్సిడీ రూ.1.20కోట్లను విడుదల చేశారు. ఒక్కో లబ్ధిదారుని దగ్గర రూ.80వేల నుంచి రూ.2లక్షల వరకు డబ్బులను కింగ్, మాజీ అధికారి తీసుకుని అందజేసినట్లు తెలుస్తోంది. పాడి పశువుల పంపిణీలో అక్రమాలను గతంలో 'సాక్షి' వెలికితీయగా, అలాగే ఇతర అక్రమాలు పాల్పడినట్లు కలెక్టర్ దృష్టికి రావడంతో విచారణ చేసి ఎస్సీ కార్పొరేషన్‌కు సరెండర్ చేశారు. గతంలో పనిచేసిన అధికారి పాల్పడిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. యూనిట్లను ఏర్పాటు చేయకుండానే సబ్సిడీలను విడుదల చేసిన అధికారి, సహకరించిన ఏజెంట్ కింగ్‌కు సంబంధించిన ఎంటర్‌ప్రైజెస్‌లపై పూర్తి స్థాయిలో విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు కోరుతున్నాయి.



సత్వర న్యాయం అందాలి

- శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌లో ఏసీపీ కార్యాలయ భవనం ప్రారంభం



ఏసీపీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, చిత్రంలో కలెక్టర్, సీపీ తదితరులు

హుస్నాబాద్: పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులకు సత్వర న్యాయం అందించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో రూ.2.84 కోట్ల వ్యయంతో ఆధునిక టెక్నాలజీతో నిర్మించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయ భవనాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందించడానికి పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలో ఫ్రెండ్లీ పోలీస్ ఒకటని, నేరస్తుల విషయంలో కఠినంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించి ప్రజల ఆదరాభిమానాలు పొందాలని సూచించారు. పోలీసులు నూతన టెక్నాలజీని ఉపయోగించి విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత సేవలు అందించాలన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది అద్భుతంగా పని చేస్తున్నారని మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేశ్, కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు సతీష్, మధు, పురుషోత్తం రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు, సీఐలు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించండి

- ఓయూ కామర్స్ డీన్ కృష్ణచైతన్య
- కామర్స్ విద్యార్థులకు ఒకరోజు వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఓయూ కామర్స్ డీన్ కృష్ణచైతన్య

సిద్దిపేటఎడ్యుకేషన్: నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఉత్తమ ప్రాజెక్టులను రూపొందిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందుతాయని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ కృష్ణచైతన్య అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ప్రాజెక్టుల తయారీ, పరిశోధనా మెలకువలపై మంగళవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో పీజీ ఫైనలియర్ విద్యార్థులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సామాజిక సమస్యలపై అవగాహన, సూక్ష్మపరిశీలన, పరిశోధనపై జిజ్ఞాస పెంపొందుతుందన్నారు. ప్రాజెక్టుల రూపకల్పనలో పాటించాల్సిన మెలకువలు, నివేదికలు తయారుచేసి సమర్పించాల్సిన విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకుని పరిశోధన మెలకువలతో ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ గోపాల సుదర్శనం మాట్లాడుతూ పరిశోధనా సమస్యల గుర్తింపు, పరిష్కార మార్గాలు, ఫలితాల విశ్లేషణ సాధనాలను అర్థం చేసుకోవాలన్నారు.

శ్రద్ధగా చదివి ధైర్యంగా పరీక్షలు రాయండి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): పరీక్షలు అంటే భయపడకుండా శ్రద్ధగా చదివి, ధైర్యంగా పరీక్షలు రాయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం ధూళ్మిట్ట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న ప్రీఫైనల్ పరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓఎంఆర్ షీట్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోళ్లకు ఏమైంది..?

- అంతుచిక్కని వ్యాధితో వేలాదిగా మృత్యువాత
- తాజాగా మజీద్‌పల్లిలో 15 వేల కోళ్లు మృతి
- ఫారాలన్నీ ఖాళీ.. పౌల్ట్రీ రైతుల గగ్గోలు
- వివరాలు సేకరించిన పశువైద్యాధికారి





మజీద్‌పల్లి కోళ్లఫారంలో మృతిచెందిన వేలాది కోళ్లు

వర్గల్(గజ్వేల్): అంతుచిక్కని వ్యాధితో జిల్లా వ్యాప్తంగా కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. కోళ్లతో కళకళలాడే పౌల్ట్రీ ఫారాలన్నీ వెలవెలపోతున్నాయి. తీవ్ర నష్టాలతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. తాజాగా వర్గల్ మండలం మజీద్‌పల్లిలోని రెండు పౌల్ట్రీఫారాలలో 15వేలపై చిలుకు కోళ్లు మృత్యువాత పడ్డాయి. మజీద్‌పల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే అలీ కోళ్లఫారం లీజుకు తీసుకుని అందులో 10వేల కోడి పిల్లలు పెంచుతున్నాడు. అదే విధంగా సయ్యద్ బాసిత్ తన సొంత ఫారంలో 7,500 కోళ్లు వేశాడు. ఈ ఫారాలలో కోళ్లను అంతుచిక్కని వ్యాధి చుట్టుముట్టింది. వ్యాధి బారినపడి ఈ రెండు ఫారాలలో వారం రోజులుగా కుప్పలకొద్ది కోళ్ల చనిపోయాయి. కోళ్ల చనిపోయి ఫారాలు ఖాళీ అవుతుండడంతో నష్టాలు చవిచూస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తా

వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడిన సమాచారం తెలిసి మంగళవారం వర్గల్ మండలం వేలూరు పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ సర్వోత్తమ్ మజీద్‌పల్లి సందర్శించారు. బాధిత పౌల్ట్రీరైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌కే అలీ ఫారంలో 8,000 కోళ్లు, సయ్యద్ బాసిత్ ఫారంలో 7,000 కోళ్లు మృతిచెందినట్లు పేర్కొన్నారు. కోళ్లు మృతిచెందిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.

నష్టాలే మిగిలాయి



కోళ్లఫారం లీజుకు తీసుకుని 10 వేల కోడి పిల్లలు వేశాను. చక్కగా ఎదిగి రూ.లక్షకు పైగా ఆదాయం వస్తదనుకున్నా. అనూహ్యంగా వారం రోజుల నుంచి వేల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. ఇప్పటికే 8,500 కోళ్లు చనిపోయాయి. మిగతావి బతికే అవకాశం లేదు. రూ.1.20 లక్షల దాకా నష్టం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎస్‌కే అలీ, పౌల్ట్రీ నిర్వాహకుడు

అలసత్వం.. సమన్వయ లోపం..



ఉమ్మడి మెదక్ జిల్లా నేతలతో సమావేశమైన మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ

నరేందర్‌రెడ్డి ఓటమికి కారణాలివే..

- ఉమ్మడి మెదక్‌లోనే అతి తక్కువ ఓట్లు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపై సుదీర్ఘ చర్చ
- ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతలతో సమావేశమైన జిల్లా మంత్రులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓటమికి గల కారణాలపై ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు సుదీర్ఘంగా చర్చించారు. గెలిచే అవకాశాలున్న ఎమ్మెల్సీ సీటు చేజారి పోవడానికి దారి తీసిన పరిస్థితులను సమీక్షించారు. ఈ ఓటమికి అభ్యర్థి నరేందర్‌రెడ్డి అలసత్వమే కారణమని పలువురు జిల్లా కాంగ్రెస్ ముఖ్యనేతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, కీలక నాయకులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహలు మంగళవారం సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అభ్యర్థి నరేందర్‌రెడ్డి అలసత్వం కారణంగానే జిల్లాలో ఆశించిన ఓట్లు పడలేదని పలు నియోజకవర్గాల నేతలు ఈ సమావేశంలో అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే అభ్యర్థి ఎంపిక కూడా మరోకారణమని, హరికృష్ణకు టికెట్ ఇస్తే ప్రయోజనం ఉండేదని, మరోవైపు టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిని నిలపకపోవడం కూడా కారణమని పలువురు నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సమావేశానికి చివరలో హాజరైన పీసీసీ చీఫ్ బి.మహేష్‌కుమార్‌గౌడ్‌తో కూడా ఈ అంశంపై జిల్లా నేతలు ప్రస్తావించినట్లు తెలిసింది.

పాత బిల్లులు క్లియర్ చేయండి

త్వరలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్)లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. అయితే గతంలో మంజూరైన అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని, ఒకరిద్దరు నాయకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాలకు మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలల అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఎందుకంత వ్యతిరేకత వస్తోందనే అంశం కూడా ఈ సమావేశంలో చర్చకొచ్చినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయాధికారి రాధిక



వరి పంటను పరిశీలిస్తున్న రాధిక

కొండపాక(గజ్వేల్): యాసంగిలో నీటి అవసరాలు తక్కువగా ఉండే పంటలను సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి టీ.రాధిక పేర్కొన్నారు. కొండపాకలో కూరగాయలు, పొద్దు తిరుగుడు, వరి పంటలు సందర్శన చేశారు. భూగర్భజలాలు విపరీతంగా తగ్గిపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయన్న విషయాన్ని రైతులు వ్యవసాయాధికారి దృష్టికి తీసుకొచ్చారు. అక్కడక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతూ ట్యాంకర్ల ద్వారా నీటి తడులను అందించుకుంటూ కాపాడుకుంటున్నామంటూ కన్నీరు పెట్టారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. యాసంగిలో తక్కువ పెట్టుబడులతో సాగు చేసే ఆరుతడి పంటలను సాగు చేసుకుంటూ లాభపడాలన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీరు విడుదల చేసేలా వ్యవసాయ శాఖ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ, జిల్లా రైతు కమిటీ కార్యదర్శి దొమ్మాట మహిపాల్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బైండోవర్

శివ్వంపేట(నర్సాపూర్) : జల్సాలకు అలవాటు పడి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని తహసీల్దార్ ఎదుట పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. మండల పరిధి చండీ గ్రామానికి చెందిన ఆంజనేయులు ట్రాక్టర్‌ను ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన మియ్యాడి రాములు, మియ్యాడి శేఖర్, సందిగాని వినయ్ ట్రాక్టర్ డాబర్ పట్టీలు చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ముగ్గురూ మద్యం మత్తులో చిల్లర దొంగతనాలకు అలవాటు పడటంతో మొదటిసారిగా కౌన్సిలింగ్ ఇచ్చి తహసీల్దార్ కమలాద్రి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్

టెక్నికల్ మేనేజర్ సునీల్



మాట్లాడుతున్న భారతి సిమెంట్ సంస్థ ప్రతినిధి

గజ్వేల్‌రూరల్: సిమెంట్ రంగంలో తిరుగులేని శక్తిగా వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ నిలిచిందని, అంతేకాక అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణాలో విడుదల చేసినట్టు ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ తెలిపారు. శ్రీమాత ట్రేడర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాట్ గ్రూప్ కంపెనీలు 13 దేశాలలో విస్తరించి ఉన్నాయన్నారు. ఈ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవడంతో పాటు నిర్మాణం దృఢంగా ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలతో పాటు రహదారులకు సరైన ఎంపిక అని, నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహకారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ సతీశ్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి తిరుపతి, టెక్నికల్ అధికారి శ్రీకాంత్, శ్రీమాత ట్రేడర్స్ డీలర్ బాలన్‌రావు, గణేశ్, రమేశ్‌తో పాటు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఆలోచనకు పదును పెట్టి.. బొట్టు బొట్టు ఒడిసి పట్టి..



రోజురోజుకూ ఎండ ప్రచండంగా మారుతున్న పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. వరికి సాగుకు నీరందక చేలన్నీ ఎండిపోయి బీటలు వారుతున్నాయి. ఇక చేసేది లేక రైతులు ఎండిన పొలాల్లో పశువులను మేపుతున్నారు. కానీ, ఇలాంటి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయాలని మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ పంచాయతీ మదిర గ్రామం ఆరెపల్లికి చెందిన లకిడి రాజేందర్ తన ఆలోచనకు పదును పెట్టాడు. బొట్టు బొట్టునూ ఒడిసి పట్టి డ్రిప్‌తో ఎకరంలో వరి సాగుకు శ్రీకారం చుట్టాడు. మండు వేసవిలో నీటిని ఒసిడి పడుతూ డ్రిప్ ద్వారా పంటకు నీటి తడిని అందిస్తున్నాడు. దీంతో వరి పచ్చగా ఎదుగుతూ దర్శనమిస్తుంది. – మిరుదొడ్డి(దుబ్బాక)



డ్రిప్ ద్వారా సాగు చేస్తున్న వరి

సాధారణంగా వరి సాగు చేయాలంటే నీటి అవసరం చాలా ఉంటుంది. వరి సాగుకు పొలం నిండా నీరు ఉంటేనే దిగుబడులు వస్తాయి. డ్రిప్ ద్వారా వరి మొక్కలకు బొట్టు బొట్టుతో నీటిని అందిస్తే సరిపోతుంది. అలాగే ఖర్చులు కూడా తగ్గుతాయి . వరి సాగుకు సంబంధించి బురద పొలాన్ని నాగలితో లేదా ట్రాక్టర్‌తో దున్నడం, గొర్రుతో చదును చేయడం, వరి నారు పోయడం, నారు పీకడం, నాట్లేయడం, కలుపు తీయడం వంటి పనులతో శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని. పొలాన్ని దున్ని నాటు వేసే వరకు పెట్టుబడులు తలకు మించిన భారంగా మారుతాయి. అదే డ్రిప్ సాగులో ఒకే సారి దుక్కి దున్ని, పొలాన్ని చదును చేసి సీడర్‌తో విత్తనాలు పెట్టుకొని డ్రిప్ ద్వారా నీటి తడిని అందిస్తే తక్కువ ఖర్చుతో గట్టెక్కవచ్చు.

కూలీల కొరత తప్పుతుంది

డ్రిప్ సాయంతో సాగు చేస్తున్న వరికి కూలీల కొరత తప్పుతుంది. నేరుగా విత్తుకున్న పొలంలో ఎక్కువగా కలుపు రాదు. దీంతో కూలీల అవసరం కూడా ఉండదు. కలుపు నివారణకు అందుబాటులో ఉన్న గడ్డి నివారణ మందును పిచికారీ చేసుకునే వీలు కలుగుతుంది. అలాగే యూరియా, పొటాష్ వంటి రసాయన ఎరువులను చల్లడం వల్ల ఎక్కువ ఖర్చవుతుంది. అదే డ్రిప్ సాగులో లిక్విడ్ యూరియాను పైపుల ద్వారా వరి దుబ్బులకు నేరుగా అందిస్తే మంచి పోషకాలు అందుతాయి. మోతాదు కంటే ఎక్కువగా వాడే రసాయన ఎరువుల ఖర్చు సైతం తగ్గుతుంది.

ఎండను తట్టుకునేలా..

సాగు నీరందక వరి చేలు ఎండుముఖం పడుతున్న నేపథ్యంలో 24 గంటల పాటు డ్రిప్ ద్వారా బొట్టు బొట్టుగా నీటి తడి నిరంతరం అందుతుండటంతో వరి దుబ్బులు పచ్చగా కళకళలాడుతూ ఎండను తట్టుకుంటున్నాయి. డ్రిప్ సాయంతో సాగవుతున్న వరికి పెద్దగా పెట్టుబడులు పెట్టకుండా సమయాన్ని, సాగు నీటిని ఆదా చేసుకునే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

డ్రిప్ పద్ధతిలో వరి సాగు

- మదిర గ్రామం ఆరెపల్లికి చెందిన రైతు రాజేందర్ వినూత్న ఆలోచన
- 24 గంటలపాటు నీటి తడులు
- మండు వేసవిలోనూ పైరు పచ్చగా..
- సమయం, పెట్టుబడి ఖర్చులు ఆదా
- తప్పనున్న కూలీల బెడద

తుంపర సేద్యం మేలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎండలు మొదలు కావడంతో ఉన్న కొద్దిపాటి నీటితో తుంపర పరికరాల ద్వారా రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. తద్వారా రైతుకు శ్రమ తగ్గడంతో పాటు నీరు కూడా తక్కువ అవసరం ఉంటుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయొచ్చు. దీంతో రైతులు తుంపర సేద్యం ద్వారా ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు.



తుంపర సేద్యం ద్వారా సాగవుతున్న మిర్చి

ఎకరాకు రూ.15 వేలు మాత్రమే



ఏడాది కిందట ఉమ్మడి జిల్లా గుమ్మడిదల, సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలంలో డ్రిప్ ద్వారా సాగవుతున్న వరి సాగుపై అవగాహన పొందాను. సాధారణ వరి సాగు ఎకరానికి సుమారు రూ. 30 వేలు పెట్టుబడి పెడితే డ్రిప్ సాగుకు రూ.15 వేలు మాత్రమే ఖర్చయ్యింది. సాగు నీరు ఆదా, సమయం, తక్కువ పెట్టుబడులు కలిసి వస్తాయి. ప్రస్తుతం చాలా చోట్ల మండుతున్న ఎండలకు వరి సాగుకు నీరు లభించక ఎండు ముఖం పడుతున్నాయి. అలాంటి పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త తీసుకున్నాను.

– లకిడి రాజేందర్, రైతు, ఆరెపల్లి

డ్రిప్‌తో వరి సాగు సాధ్యమే



ఆరుతడి సాగు మాదిరిగానే డ్రిప్ పద్ధతిలో వరి సాగు సాధ్యమే. రైతు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు, మెలకువలు, సూచనలు పాటిస్తే మంచి దిగుబడి లభిస్తుంది. సాధారణ వరి సాగుకు ఎకరానికి 25 నుంచి 30 కిలోల విత్తనాలు అవసరమైతే, డ్రిప్ సాగుకు కూడా ఎకరానికి రెండు కిలోల వరి విత్తనాలు సరిపోతాయి. సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే తక్కువ సమయంలో ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడిని సాధించే అవకాశాలు ఉన్నాయి.

– మల్లేశం, మండల వ్యవసాయ అధికారి, మిరుదొడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

జ్యోతిషం పేరుతో మోసం

రూ.లక్ష కాజేసిన దొంగ బాబా

మద్దూరు(హుస్నాబాద్): జ్యోతిషం పేరుతో మోసం చేసి రూ.లక్ష కాజేసిన దొంగ బాబాను మద్దూరు పోలీస్‌లు అరెస్టు చేశారు. చేర్యాల సీఐ శ్రీను కథనం మేరకు.. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన దక్షిణపు శివయ్య అనే బాబా ఇటీవల చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామానికి చెందిన ధర్మోజీ నారాయణచారి జీ టీవీలో జ్యోతిషం చెప్పబడును అని ఒక ఫోన్ నంబర్‌ను చూశాడు. ఆ నంబర్ ద్వారా బాబాకు ఫోన్ చేసి తన ఇంటిలో ఇబ్బందులు ఉన్నాయని, మనశ్శాంతి దొరకడం లేదని చెప్పాడు. పూజ చేస్తే మంచి జరుగుతుందని బాధితుడిని బాబా నమ్మించాడు. రెండు విడుతల్లో రూ.లక్ష తీసుకున్నాడు. మళ్లీ కొద్ది రోజులకు మరిన్ని డబ్బులు కావాలని అడుగడంతో నారాయణచారికి అనుమానం వచ్చి పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు సాంకేతి పరిజ్ఞానం ఉపయోగించి దొంగ బాబాను పట్టుకున్నారు. అతడి ఫోన్ సీజ్ చేసి లక్ష రూపాయలను బాధితుడికి అందించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట మద్దూరు ఎస్‌ఐ షేక్ మహబుబ్, పోలీసులు, తదితరులు ఉన్నారు.

ర్యాంక్‌లు కొలమానం కాదు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- సబ్జెక్ట్‌ల వారీగా పరిజ్ఞానం పెంచుకోవాలి
- విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన
- బస్వాపూర్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థులకు ర్యాంక్‌లు, మార్కులు కొలమానం కాకుండా సబ్జెక్ట్‌ల వారీగా విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్నినేటివ్ విద్యా ఫౌండేషన్ సహకారంతో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయగా కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తుందని గ్రామంలోని విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో తాగునీరు, రెండు తరగతి గదులు, స్పోర్ట్స్ మెటీరియల్ అవసరం ఉందని విద్యార్థులు అడగగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో దేవకీ, ఆర్డీవో రామ్మూర్తి, ఎంఈవో పద్మాయ్య, ఇన్నినేటివ్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): గతంలో పెద్దవారికే కంటి అద్దాలు వచ్చేవి ఇప్పుడు చిన్న పిల్లలకు కూడా వస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉచిత కంటి క్యాంపులో 304 మందికి స్క్రీనింగ్ చేసినట్లు తెలిపారు. 129 మందికి ఆపరేషన్ అవసరం కాగా 72 మంది సెలెక్ట్ అయ్యారన్నారు. 52 మందికి ఈరోజు, వచ్చే వారం మిగిలిన వారిని ఆపరేషన్‌కు తీసుకెళ్తామన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, జిల్లా గంథ్రాలయం చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, డీఎంహెచ్‌వో పల్వాన్, ఆర్డీఓ రామ్మూర్తి పాల్గొన్నారు.



పంటలో చిరు సంచులపై క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

వరికి బదులు మొక్కజొన్న వేసుకోవాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): వరితో పోల్చుకుంటే మొక్కజొన్న పంట కాలం తక్కువ, నికర ఆదాయం అధికమని వ్యవసాయ పరిశోధన కేంద్రం డాక్టర్ శ్రావణి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి అన్నారు. అక్కన్నపేట మండలం చౌటకుంట తండాలో మంగళవారం ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన తోర్నాల ఆధ్వర్యంలో మొక్కజొన్న చిరు సంచులైన కేఎస్ఎంహెచ్-4191 హైబ్రిడ్ రకంను రైతుల పొలంలో క్షేత్ర ప్రదర్శన చేసి అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ రకం మొక్కజొన్న హైబ్రీడ్ నీటి ఎద్దడిని, ఎండు తెగులను తట్టుకోవడమే గాక యాసంగి కాలానికి అనుకూలమైనవని అన్నారు. అదే విధంగా మార్చి ఏప్రిల్ మాసాల్లో పడే వడగండ్ల నుంచి కూడా రైతులు పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. చీడ పీడలను తట్టుకొని, వర్షాభావ పరిస్థితుల్లో కూడా రైతులకి మంచి దిగుబడులను అందజేస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తాన, వ్యవసాయ విస్తరణాధికారి కరంటోతు శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

- స్థలం మ్యుటేషన్ కోసం రూ. 20 వేలు డిమాండ్
- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి
- ఏకకాలంలో రెండు చోట్ల ఏసీబీ సోదాలు
- అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలింపు



పట్టుబడ్డ ఆర్‌ఐ జానయ్య

మెదక్ మున్సిపాలిటీ: ఏసీబీ అధికారులకు ఓ మున్సిపల్ ఆర్‌ఐ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటన మెదక్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మెదక్ పట్టణానికి చెందిన ధర్మగల్ల శివ కుమార్ తన సోదరి శైలజకు సంబంధించిన సర్వే నంబర్ 505/1/1/2 లోని 605 గజాల ఖాళీ స్థలాన్ని మ్యుటేషన్ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై సదరు అధికారి పని చేయకుండా పలుమార్లు తిప్పుకొని రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. రూ.12 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో బాధితుడు గత నెల 24న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు బృందం పక్కా ప్రణాళికతో వలపన్నారు. మెదక్ మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధితుడిద నుంచి మున్సిపల్ ఆర్‌ఐ జానయ్య రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మెదక్ మున్సిపల్ కార్యాలయంతోపాటు సూర్యాపేటలోని ఆర్‌ఐ ఇంట్లోనూ ఏకకాలంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు 8 గంటల పాటు అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వివరాలు సేకరించారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్యను అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఈ సోదాలో సీఐలు వెంకటేశ్వర్లు, రమేశ్‌తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జొన్న.. లాభాలు మిన్న

- పెరిగిన సాగు విస్తీర్ణం
- జిల్లా వ్యాప్తంగా సుమారు 42 వేల ఎకరాల్లో సాగు
- మార్కెట్‌లో మంచి డిమాండ్
- క్వింటాల్‌కు రూ.6 వేలు



హద్నూర్ గ్రామంలో సాగు చేస్తున్న జొన్న పంట

జహీరాబాద్ టౌన్: చిరు ధాన్యాల పంటల్లో అత్యధికంగా పండించే పంటల్లో జొన్న ఒకటి. కార్బొహైడ్రేట్లు, ఫైబర్ ఎక్కువగా ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఆరోగ్యాన్నిచ్చే ఆహారపు పంటగా జొన్న ప్రజాదరణ పొందింది. ఒకప్పుడు పల్లెల్లో విరివిగా కాసిన జొన్న పంట కాలక్రమంలో తగ్గిపోయింది. ప్రజలు జొన్న రొట్టెలు తినడం ప్రారంభించడంతో మళ్లీ డిమాండ్ పెరిగింది. (తెల్ల) జొన్న ఆహారపు అవసరాలకు ఎక్కువగా వినియోగిస్తున్నారు. తెల్ల జొన్నకు మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. గిట్టుబాటు ధర కూడా లభిస్తుండడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు జొన్న పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గంలో రబీలో జొన్న అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. జిల్లాకు సరిహద్దులో ఉన్న కర్నాటక, మహారాష్ట్రలో కూడా ఈ పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. జొన్న సాగుకు నల్లరేగడి నేలలు లేదా తేలిక పాటి ఎర్ర చల్క నేలలను శ్రేయస్కరం. రబీలో పండించే జొన్న వర్షాధారిత పంట కాదు. గాలిలోని తేమ ద్వారానే పంట పండుతుంది. జొన్నకు తెగుళ్ల బెడద తక్కువే. ఇతర పంటల మాదిరిగా ఆశించినంతగా ఉండదు. నెమళ్లు, అడవి పందుల బెడద ఉంటుంది. వాటి నుంచి రక్షించుకునేందుకు కష్ట పడితే చాలు. జిల్లాలో గతేడాది జొన్న పంట సుమారు 35 వేల ఎకరాల్లో సాగవగా ఈ ఏడాది సుమారు 42 వేల ఎకరాల్లో రైతులు పంట పండిస్తున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. క్వింటాల్‌కు రూ. 6 వేల వరకు పలుకుతుంది. ఎకరాలకు సగటున 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. నెల రోజుల్లో పంట చేతికి వస్తుంది. కొనుగోళ్ల కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంటను కొనడం వల్ల రైతులకు పంట అమ్మడానికి ఇబ్బందులు ఉండవు.

ఆశాజనకంగా ఉంది

జొన్న పంటకు డిమాండ్ ఉండడంతో ఈసారి ఎకరం పొలంలో జొన్న పంట వేశా. ఇప్పటికైతే పంట చాలా మంచిగానే ఉంది. ప్రస్తుతం కోతకు వచ్చింది. కోసిన తర్వాత దిగుబడి రేటు చూస్తే తెలుస్తుంది. లాభం వస్తే వచ్చే సంవత్సరం కూడా రబీలో జొన్న పంట వేస్తా.

-సీ.నాగన్న, రైతు, హద్నూర్

అధిక దిగుబడులు వస్తాయి



రైతులు జొన్న పంట సాగు ఆసక్తి చూపడం మంచిదే. రెండు, మూడేళ్ల నుంచి పంట సాగు విస్తీర్ణం పెరుగుతుంది. అనువైన రకాలు ఎంపిక చేసుకొని సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి. జొన్నకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులకు లాభం కలుగుతుంది.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

మద్యం మాన్పించారని ఆత్మహత్య

దుబ్బాకటౌన్: ఉరేసుకొని హమాలీ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయపోల్ మండలం కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రఘుపతి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన బ్యాగరి శ్రీను (45) వ్యవసాయం చేస్తూనే హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిస కాగా కుటుంబ సభ్యులు మందలించి మద్యం మాన్పించారు. సోమవారం భార్య చంద్రకళతో తనకు డబ్బులు ఇవ్వాలని గొడవపడగా ఆమె ఇవ్వలేదు. మద్యం మాన్పించారని మనస్తాపం చెంది, జీవితంపై విరక్తితో మంగళవారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో భర్త



స్వామి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు.. నార్సింగి గ్రామానికి చెందిన వట్టెపు స్వామి(32)కి మూడేళ్ల కిందట వడియారం గ్రామానికి చెందిన శిరీషతో వివాహమైంది. పిల్లలు కావడం లేదని తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో 9 నెలల కిందట శిరీష పుట్టింటికి వెళ్లింది. పెద్దల పంచాయితీ పెట్టగా ఇరువురికి నచ్చజెప్పారు. కాపురానికి వచ్చిన భార్య 20 రోజుల కిందట మళ్లీ గొడవపడి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన స్వామి మంగళవారం ఉదయం సోదరుడు శ్రీకాంత్‌కు ఫోన్ చేసి వల్లూర్ అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అక్కడికి చేరుకొని స్వామిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఆగమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి



ప్రశాంత్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చేపూరి ప్రశాంత్(31) గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసై భార్య సుకన్యను ఇబ్బందులకు గురి చేయడంతో పుట్టింటికి వెళ్లింది. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

మాజీ ఉప సర్పంచ్

కల్హేర్(నారాయణఖేడ్): ఉరేసుకొని మాజీ ఉపసర్పంచ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కృష్ణాపూర్ మాజీ ఉపసర్పంచ్ మల్రెడ్డి ఈశ్వర్(48) వ్యవసాయం చేస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఈశ్వర్ మంగళవారం గ్రామ శివారులోని పురాతన గడిలో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్ కుటుంబీకులను పరామర్శించారు. ఈశ్వర్ మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

LOST

■ I, CHAMAKURA SUSHMA Reddy W/o Sundeep Reddy, R/o H. No. 1-9-35, New Bowenpally, Tirumalgherry, Secunderabad, Present Residing at Villa No.97, Medchal Road, Prestige Park, Gundlapochampally, Shameerpet Mandal, Medchal-Malkajgiri Dist., TS. I have Lost my Original Passport bearing No. M8290975 while Travelling in a Car from Wargal to Gowraram. If anybody found Please Contact. Cell:6309550994 [H-1214129]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.